వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

కడప కార్పొరేషన్ : రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ చట్టంకు వ్యతిరేకంగా ఈనెల 4వ తేదిన నిర్వహించే లాంగ్‌మార్చ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని నగర ముస్లిం ప్రముఖులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గుంతబజారు మసీదు వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తేదీ ఉదయం 9 గంటలకు గౌస్ నగర్ నుండి లాంగ్‌మార్చ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో జరుగుతుందని వివరించారు. ఈ నిరసనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ విషయంగా కేంద్రం దిగివచ్చేవరకు పోరాటాలు కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబాన్ బాష, కార్పొరేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 4న కడప నగరంలో వక్ఫ్ నూతన సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న గ్రాండ్ లాంగ్ మార్చ్ జయప్రదం చేయాలని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్ అహ్మద్ బాబు, సిటీ కన్వీనర్ జాకీర్ , జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా జరిగిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున గ్రాండ్ లాంగ్ మార్చ్ కార్యక్రమానికి పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా భారీ సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగేలాగా అందరూ తోడ్పడాలని కోరుకుంటున్నామన్నారు. ఈ గ్రాండ్ లాంగ్ మార్చ్ కార్యక్రమం గౌస్ నగర్ నుండి మొదలు పెట్టి మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా సర్కిల్, శివలింగం బీడీ ఫ్యాక్టరీ, అల్మాస్పేట సర్కిల్, పెద్ద మట్టి పులి, రెండో గాంధీ బొమ్మ, వన్ టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్, ఏడు రోడ్ల కూడలి వరకు జరుగుతుందన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నాయకులు

4న జరిగే ర్యాలీకి సంపూర్ణ మద్దతు

కడప కార్పొరేషన్ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 4వ తేదీన కడప నగరంలో ముస్లిం మైనార్టీలు చేపట్టిన భారీ ర్యాలీకి తమ సంపూర్ణ మద్దతు ఇవ్వడమే కాకుండా పాస్టర్లు అందరూ పాల్గొనాలని షాలోమ్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి గుర్రప్ప కోరారు. శుక్రవారం సియోన్‌పురంలో ఉన్న తన కార్యాలయంలో సంఘం పెద్దలు, సభ్యులు కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 సంవత్సరాల క్రితం వక్ఫ్ బోర్డు సంబంధించిన ఆస్తుల ఆధారాలు చూపాలని అడగడం పాలకుల అవివేకమన్నారు. వక్ఫ బోర్డు కు సంబంధించిన మసీదు, దర్గా ల ఆస్తుల్లో ప్రభుత్వ జోక్యం తగదని హితవు పలికారు. మనది లౌకిక ప్రజాస్వామ్య దేశమని ఇందులో అన్ని మతాలు సమానమన్నారు. అయితే పాలక ప్రభుత్వా లు క్రైస్తవులపై వివక్ష చూపడం దారుణమన్నారు. నేడు మసీదు ఆస్తులు అడిగే ప్రభుత్వాలు రేపు క్రైస్తవ మిషనరీలకు చెందిన ఆస్తుల పై కూడా జోక్యం చేసుకోదనే గ్యారంటీ లేదన్నారు. ఈ సమావేశంలో పాస్టర్లు ఎ. జయకుమార్, డి.జయా నంద్ , బేరి జయరాజు, డీవీ ప్రసాద్ రావు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.


లాంగ్‌మార్చ్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న సుబాన్‌బాషా, షఫీ తదితరులు


మాట్లాడుతున్న షాలోమ్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గుర్రప్ప

క్లుప్తంగా

హెల్మెట్ ధరించి ప్రయాణించండి


ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సీఐ జావిద్

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలను నడిపేవారు తప్పకుండా హెల్మెట్‌ను ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని ట్రాఫిక్ సీఐ జావిద్ పేర్కొన్నారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేయించిన హెల్మెట్ ధరించండి.. ప్రమాదాల నుండి కాపాడుకోండి అనే ప్రచార ఫ్లెక్సీ బ్యానర్‌ను కడప నగర ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనం కోసం సేవా సాంస్కృతిక క్రీడా అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా, రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ కరిముల్లా, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడప తాలూకా సీఐగా రెడ్డప్ప


తాలూకా సీఐగా బాధ్యతలను స్వీకరించిన రెడ్డెప్పను కలిసిన పోలీసు సిబ్బంది

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్ స్టేషన్ సీఐగా రెడ్డప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. సీఐగా 2010లో పదోన్నతి పొందారు. సీఐగా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం కడప సీసీఎస్ లో విధులు నిర్వహిస్తున్న ఆయన తాలూకాకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలను స్వీకరించిన సీఐ రెడ్డెప్ప మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతామన్నారు.

క్యారమ్స్‌లో ఉచిత శిక్షణను వినియోగించుకోండి

కడప ఎడ్యుకేషన్: కడప పట్టణంలో డీఎస్‌ఏ సహకారంతో ఇండోర్ స్టేడియంతోపాటు మద్రాస్ రోడ్డులోని మునిసిపల్ ఉర్దూ పాఠశాల ఆవరణలో ఉచిత క్యారమ్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యారమ్ కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్స్ పోలంకి గణేష్ బాబు, సురేకృష్ణయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని కడప బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకొని జిల్లా స్థాయిలో క్యారమ్స్ పోటీలకు అర్హత సాధించవచ్చునన్నారు. మండలం, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొని జాతీయ స్థాయికి చేరే అవకాశాలు ఉన్నాయని.. ఈ అవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు కోచ్, పీడీ పోలంకి గణేష్ బాబు సెల్ 8297059998 సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ అధికారులూ.. ఇటు చూడరా..!


ఆర్టీసీ బస్టాండులో అపరిశుభ్రంగా ఉన్న హాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ ఫోటోలోని పరిస్థితి చూస్తే ఏదో పాడుబడిన భవనం లాగా కనిపిస్తోంది. అయితే ఈ పరిస్థితి నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉండే కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంతం. ఆర్టీసీ బస్టాండు ప్రధాన ద్వారం పక్కనగల హాలు మరమ్మతులకు గురి కావడంతో ఇటీవల ఆయా పనులను పూర్తి చేశారు. అందులో భాగంగా కిందపడిన శ్లాబు పెచ్చులు, ఇతర వస్తువులను అక్కడి నుంచి తరలించాల్సిన విషయాన్ని మరిచారు. ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో జంతువులు ఆ ప్రాంతంలో సంచరిస్తూ మరింత అపరిశుభ్రంగా మార్చడం జరుగుతోంది. ప్రతిరోజు వేలాది మంది ప్రయాణీకులు బస్టాండులోకి వెళ్లాలన్నా, బయటికి రావాలన్నా ఈ ప్రాంతం నుంచే రాకపోకలు కొనసాగించాల్సి ఉంది. అయితే అపరిశుభ్ర వాతావరణంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ప్రాంతం శుభ్రం చేసి షాపులకు అద్దెకు ఇచ్చినా ఆర్టీసీకి ఆదాయం ఒనగూరేది. ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని శుభ్రపరిచి వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

చెత్తా చెదారం మధ్య పోస్టల్ బాక్సు..

సాధారణంగా పోస్టాఫీసుల్లో ఉండాల్సిన పోస్టల్ బాక్సు ఆర్టీసీ బస్టాండులో అపరిశుభ్రత ప్రాంతంలో పడేశారు. ఈ బాక్సు ఇక్కడికి ఎవరు తీసుకు వచ్చారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనిని సరైన స్థితిలో వాడితే ఉపయోగకరంగా ఉంటుందన్న విషయాన్నిమరిచి ఇలా చెత్తాచెదారం మధ్య పడేయడంపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై మోడీ స్పందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధాని నరేంద్ర మోడీ కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై స్పందించాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ. రామమోహన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో అమరావతి పర్యటన సందర్భంగా మోడీ కడప ఉక్కు నిర్మాణంపై స్పందించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో స్పష్టంగా కడప ఉక్కు నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో కొనసాగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం పెద్ద కష్టమేమీ కాదని ప్రజలు భావిస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరికొకరు సహకరించుకునే ధోరణి కొనసాగుతున్నప్పుడే ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించేలా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులరెడ్డి , నగర కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, కుమారస్వామి రెడ్డి, నారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట సుబ్బయ్య, హరిచంద్ర రెడ్డి, సాంబ శివారెడ్డి, నరసింహ, గోవిందు, తిమ్మయ్య, సరిత, జార్జి, శేఖర్, రసూల్, ఉదయ్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉపాధ్యాయ లోకానికి దార్శనికుడు దాచూరి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ లోకానికి దాచూరి రామిరెడ్డి దార్శనికుడని ఆయనను నేటి ఉపాధ్యాయలోకం ఆదర్శంగా తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా సూచించారు. దాచూరి రామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ యూటీఎఫ్‌ను రాష్ట్రంలో బలమైన సంఘంగా రూపొందించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. దాచూరి రామిరెడ్డి తన జీతాన్ని, జీవితాన్ని ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. ఆయన ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో తన ఖర్చులకు పోను మిగిలిన సొమ్మును యూటీయఫ్ సంఘానికి, ప్రజా సంఘాలకు జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కేదార్నాథ్, ప్రకాష్ బాబు, దావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


దాచూరి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ మద్దతు ప్రకటించింది. కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి సందర్శించారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని పర్మినెంట్ చేయాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ మొత్తాన్ని చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలాయాపన చేయడం తగదన్నారు.

తక్షణమే డ్యూటీలో చేరకపోతే టెర్మినేట్ చేస్తామంటూ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ బెదిరించడం సరికాదన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించకపోతే తమ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా కోశాధికారి సి.అమ్ములు తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్‌ఓల సమ్మెకు మద్దతు తెలియజేస్తున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

చిరు వ్యాపారులకు చేయూత


చిరు వ్యాపారులకు అందజేసిన గొడుగుల వద్ద మానవత సంస్థ ప్రతినిధులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని అనేక కూడళ్లలో మండుటెండలలో వ్యాపారం చేసుకుంటున్న పేద బలహీన వర్గాలకు చెందిన వ్యాపారులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తన వంతుగా అండగా నిలిచింది. శుక్రవారం ఆయా వ్యాపారులకు ఎండ నుంచి రక్షణ కల్పించేలా పెద్దగొడుగులను అందజేశారు. రాజీవ్ మార్గ్, సంధ్య సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, పాత బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, అశోక్ లాడ్జి సర్కిల్ , శంకరాపురం, గురుకుల్ పాఠశాల వద్ద ఉన్న ఉన్న పేద వ్యాపారులను గుర్తించి వారికి గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి , మానవత కేంద్ర డైరెక్టర్లు డాక్టర్ ఏ.రామాంజుల రెడ్డి, రాటాల గోపి, జిల్లా అధ్యక్షులు సి సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సుబ్బయ్య, కృష్ణారెడ్డి, మానవతా సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం


రిమ్స్‌లో అన్నదానం చేస్తున్న బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేదలకు సేవ చేయడంతో ఆత్మసంతృప్తి లభిస్తుందని బీచు నరేష్ కుమార్ రెడ్డి, బీచు ధన్విత్ కుమార్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం దివంగత బీచు నాగేశ్వరరెడ్డి 8వ వర్ధంతిని పురస్కరించుకుని బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప రిమ్స్ జనరల్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనే కడప నగరంలోని పలు కూడళ్లలో ఉంటున్న ఆదరణలేని నిరుపేదలకు, వికలాంగులకు కూడా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దివంగత బీచు నాగేశ్వరరెడ్డి సతీమణి బీచు అక్కయ్య, కోడలు వీణా వాణి, కుమార్తె కియాన్షి , శివనాగి రెడ్డి. చేతన్ రెడ్డి, హిమ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అనుభవజ్ఞుల సూచనలు పాటించాలి


జ్యోతి వెలిగిస్తున్న వీసీ తదితరులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో శుక్రవారం భారతీయ శిక్షణ మండలి 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ్ కుమార్, విశ్రాంత ఆచార్యుడు డా. పెంచలయ్య, జాతీయ విద్యా విధానానికి నోడల్ ఆఫీసర్ డా. జి. ఫణీంద్ర రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు భారతీయ శాస్త్ర సాంకేతిక అభివృద్ధి, జాతీయ విద్యా విధానం గురించి వివరించారు. వర్సిటీలో భారతీయ శిక్షణ మండలి అభివృద్ధి పరంపరను ప్రపంచ స్థాయి ఉదాహరణలతో స్పష్టంగా వివరించారు. వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన వక్తల సూచనలు విద్యార్థులు పాటిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉండి వికసిత్ భారత్ దిశగా మార్గనిర్దేశకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లు

కడప సెవెన్‌రోడ్స్ : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్ (డ్రైవర్)ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 500 మంది కెప్టెన్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరంతా అరబిందో సంస్థ ద్వారా ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖకు సేవలు అందిస్తున్నారన్నారు. అరబిందో యాజమాన్యం గత ఏడేళ్లుగా వీరికి రూ.8800 వేతనాన్ని మాత్రమే చెల్లిస్తోందని చెప్పారు. సీటీసీ పేరిట యజమాని చెల్లించాల్సిన పీఎఫ్ వాటాను కూడా ఉద్యోగుల నుంచి మినహాయించడం దారుణమన్నారు. ఆదివారం వీక్లీ ఆఫ్‌లు, పండుగలు చట్టప్రకారం అమలు చేయాల్సి ఉండగా ఒక్క సెలవు కూడా ఇవ్వడం లేదన్నారు. అలాగే ఇప్పటివరకు ఇంక్రిమెంట్లు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. వీరు ఏజెన్సీ ద్వారా నియమించబడినా ప్రధాన యజమాని రాష్ట్ర ప్రభుత్వమే అన్న విషయాన్ని విస్మరించదన్నారు. వీరికి తక్షణమే రూ. 18,500 వేతనాన్ని ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్యమే చెల్లించాలని, చట్టప్రకారం సెలవులు ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణకు అవసరమైన సెల్‌ఫోన్‌తోపాటు రీఛార్జి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో 102 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సోము మహేష్, చరణ్, సీఐటీయూ నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి, దస్తగిరి, ఓబుల్‌రెడ్డి, నాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు.

విద్యుత్ కోతలతో జనం ఇక్కట్లు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలంలో విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతుంటే విద్యుత్ అధికారులు తమ ఇష్టానుసారంగా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు విధిస్తూ విద్యుత్‌ను తీసేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అని తేడా లేకుండా విద్యుత్‌ను నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు విద్యుత్ అంతరాయంపై సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే కొత్త లైన్లు వేస్తున్నారని సమాధానం చెబుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూలవంక సబ్ స్టేషన్ పరిధిలో ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.